ఆటోవాలాకు.. అందని సొమ్ము!

- ఆటో డ్రైవర్‌ల ఖాతాల్లో పడని సొమ్ము
- ఇతరత్రా కారణాలు చూపి ఎగరగొట్టిన ప్రభుత్వం
- గతంలో అందరినీ ఆదుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- మండలంలో 300 మందిలో 120 మందికి మాత్రమే అర్హులంటా..


తాళ్లూరు స్టాండ్‌లో ఖాళీగా ఉన్న ఆటోలు

తాళ్లూరు: మోసపూరిత హామీలు, అబద్ధపు ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను, కార్మికులను, రైతులను వేధిస్తోంది. ముఖ్యంగా కార్మిక, కర్షకులను ఆదుకోకుండా రోడ్డున పడేసింది. మేం అధికారంలోకి వస్తే షరతులు లేకుండా అందరికీ పథకాలు అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం నేడు సవాలక్ష కొర్రీలతో తూతూ మంత్రంగా నగదు జమచేసి చేతులు దులుకుంటోంది. సూపర్ సిక్స్–సూపర్ సక్సెస్ అని గ్లోబెల్స్ ప్రచారంతో పబ్బం గడుపుకుంటోంది. తాజాగా ఆటో డ్రైవర్‌లకు ఇవ్వాల్సిన రూ.15 వేలను కొందరికి మాత్రమే అందించి మోసం చేసింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు అండగా ఉండేందుకు వైఎస్సార్ వాహనమిత్ర పథకం ద్వారా ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.10 వేలు వంద శాతం పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందించి మేలు చేసింది. అనంతరం వచ్చిన కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ సేవలో పథకంగా మార్చింది. కానీ అర్హులకు అందించడంలో పూర్తిస్థాయిలో విఫలమైందని ఆటో డ్రైవర్‌లు విమర్శిస్తున్నారు. మండలంలో 300 మందికి పైగా డ్రైవర్లు ఉంటే వారిలో కేవలం 120 మందికి మాత్రమే అర్హులంటూ అధికారులు ప్రకటించారని ఆటోయూనియన్ నాయకులు పేర్కొంటున్నారు.

ఖాతాలో ఇప్పటికీ జమవ్వని దుస్థితి..

కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించి ఆటోడ్రైవర్ల జీవనోపాధికి బ్రేకులు వేసింది. ప్రతి ఒక్క ఆటోడ్రైవర్ రూ.15 వేలు ఇస్తానని చెప్పిన కూటమి ప్రభుత్వం మండలంలోని కొంత మంది ఆటోడ్రైవర్లకు వివిధ కారణాలు చూపి మోసం చేసింది. పథకం అమలు చేసిన రోజే అకౌంట్‌లోని డబ్బులు జమ చేశామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ ఐదు రోజులు దాటినా కూడా ఆటో డ్రైవర్ సేవలో సొమ్ము అందలేదని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు.

ఇప్పటి వరకు డబ్బులు అందలేదు..

గత ప్రభుత్వంలో వైఎస్సార్ వాహన మిత్ర డబ్బులు వెంటనే పడ్డాయి. ఈ ప్రభుత్వం అమలు చేసిన ఆటో డ్రైవర్ సేవలో డబ్బులు అందలేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. మళ్లీ దరఖాస్తు చేయాలంటున్నారు. ప్రభుత్వం ఇస్తానన్న డబ్బులు కోసం ఎదురు చూస్తున్నాను.

– ఆర్ వెంకట సుబ్బారావు, దోసకాయల పాడు

ఆన్‌లైన్‌లో పేరు లేదంటున్నారు..



ఎనిమిదేళ్లుగా ఆటో తోలుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. ఆటో డ్రైవర్ సేవలో డబ్బులు అందలేదని సచివాలయానికి వెళ్లాను. ఆన్‌లైన్‌లో పేరు లేదు అంటున్నారు. ఇలా అయితే ఎలా. ఎప్పుడు డబ్బులు పడతాయి.

– గవిడి శెట్టి సురేష్, మాధవరం

బ్యాంక్ అకౌంట్‌లో సమస్య అంటున్నారు..



డబ్బులు జమైనట్లు మేసేజ్ రాలేదని బ్యాంక్‌కు వెళ్లాను. బ్యాంక్ అకౌంట్ సమస్య అంటున్నారు. అకౌంట్ చెక్ చేయించాను. డబ్బులు జమ వ్వలేదన్నారు. గతంలో పడ్డాయి. ఇప్పుడు ఎందుకు పడలేదో అర్థం కావడం లేదు.

– షేక్.మస్తాన్ వలి, తూర్పుగంగవరం

విద్యార్థులకు, వృద్ధులకు ఐతే బాగుండు..



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆటో డ్రైవర్లు జీవనోపాధి కోల్పోయారు. గంటల పాటు ఎదురు చూస్తున్న ప్రయాణికులు బస్సు ప్రయాణానికే ఆసక్తి చూపుతున్నారు. దీంతో డీజిల్‌కు సరిపడా డబ్బులు కూడా రావడం లేదు. చదువుకునే విద్యార్థులకు, వృద్ధులకు ఐతే ఉచిత బస్సు ప్రయాణం బాగుండేది.

– తాండ్ర శ్రీను, తూర్పుగంగవరం

రాష్ట్రాన్ని దోచుకోమని చంద్రబాబు ఫ్రీ హ్యాండ్ ఇచ్చాడు

- మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి, పక్కన ఎమ్మెల్యే చంద్రశేఖర్

యర్రగొండపాలెం: రాష్ట్రంలో ఉన్న ప్రజల సొత్తు దోచుకొని జాగ్రత్తగా దాచిపెట్టుకోమని కూటమి నాయకుడు, సీఎం నారా చంద్రబాబు నాయుడు తమ ఎమ్మెల్యేలకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చాడని.. ఇదే అవకాశంగా కూటమి ఎమ్మెల్యేలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి అన్నారు. ఆదివారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన యర్రగొండపాలెం వచ్చారు. స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఉన్న ఆయనను ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనతో కలిసిన విలేకరులతో కాసేపు మాట్లాడారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే పరమావధిగా భావించి అన్ని వర్గాలకు చెందిన పేదలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకున్నారని, తన బాటలోనే ఎమ్మెల్యేలను నడిపించారన్నారు. పేద విద్యార్థుల దృష్టిలో పెట్టుకొని జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసుకోవటానికి అనుమతులు తీసుకొని వచ్చారని, ఇది దేశ చరిత్రలో నిలిచే ఘట్టమని ఆయన అన్నారు.

తమ వర్గీయుల సంపాదన కోసం పీపీపీ..

మెడికల్ కళాశాలలపై కూటమి ప్రభుత్వం కన్నేసి తమ వర్గీయుల సంపాదన కోసం పీపీపీ విధానాన్ని తీసుకొని వచ్చిందని, వాటిని 66 సంవత్సరాల పాటు అనుభవించటానికి అతితక్కువ లీజుకు కట్టబెడుతుందని ఆయన విమర్శించారు. బాబు తన సామాజిక వర్గానికి చెందిన వారికి 60 శాతం, కూటమిలో పెత్తనం చెలాయిస్తున్న ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారికి 40 శాతం ప్రకారం దోచుకునే అవకాశాన్ని కల్పించారన్నారు. మార్కాపురంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీని పూర్తి చేసినట్లయితే మెరుగైన వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్న ఎస్సీ, ఎస్టీ, పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, ప్రస్తుతం అటువంటి అవకాశం లేకుండా పోయిందని ఆయన అన్నారు. కేపీ వెంట ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, జిల్లా కార్యదర్శి కె.ఓబులరెడ్డి, మండల కన్వీనర్ ఏకుల ముసలారెడ్డి, మాజీ ఎంపీపీ మార్తాల సుబ్బారెడ్డి ఉన్నారు.

శిథిలావస్థకు చేరిన బాదాపురం చప్టా


చిల్ల చెట్లతో నిండి శిథిలావస్థకు చేరిన చప్టా

దొనకొండ: మండలంలోని బాదాపురం, ఎస్సీ కాలనీ వాసులు నిత్యం ప్రయాణం సాగించే చప్టా శిథిలావస్థకు చేరింది. ఈ గ్రామాల ప్రజలు రాకపోకలు నిత్యం సాగిస్తుంటారు. బాదాపురం ప్రజలు ఎస్సీ కాలనీకి రావడానికి, ఎస్సీ కాలనీ వాసులు బాదాపురం వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో నాసిరకంగా చప్టా నిర్మించటంతో నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో ఆ ప్రాంతం అంతా చిల్లచెట్లతో నిండి పోయింది. అంతేకాకుండా నిత్యం వాహనదారులు వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉంటుంది. అంతేకాకుండా నిత్యం రైతులు ట్రాక్టర్ల ద్వారా పొలాలకు వెళ్లాల్సి వస్తుంది. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవటంతో పక్కనే వాగులో నుంచి ప్రయాణం సాగిస్తున్నారు. వర్షం కురిసిన సమయంలో వాగులో నీరు ప్రవహిస్తుంది. ఆ సమయంలో రాక పోకలు బందవుతాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేదని గ్రామ ప్రజలు, ఎస్సీ కాలనీ వాసులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన చప్టా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు కోరుతున్నారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు నాగూర్‌బీ

సంతనూతలపాడు: అనంతపురంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు షేక్ నాగూర్‌బీ కోరారు. మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యంలో ఆదివారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఐద్వా జెండాను మండల కమిటీ సభ్యురాలు షేక్ మస్తాన్‌బీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షేక్ నాగూర్‌బీ మాట్లాడుతూ ఐద్వా పోరాట ఫలితంగా మహిళల హక్కుల సాధన కోసం అనేక చట్టాలు సాధించుకున్నామన్నారు. రాష్ట్ర మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి 600 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. జిల్లా నుంచి కూడా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీహెచ్ సునంద, షేక్ ఫరీదాబీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తల్లికి పూజలు


ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ, స్థానిక కళాశాల రోడ్డులోని పోలేరమ్మ ఆలయం, మండలంలోని కోలభీమునిపాడు వద్ద ఉన్న ముద్దసానమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిగ్రహ మూర్తులను ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. అల్లూరి పోలేరమ్మ ఆలయ ఆవరణలోని నాగ శిలలు, పుట్టకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

క్లుప్తంగా

గంగమ్మ తల్లికి పొంగళ్లు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో కొలువై ఉన్న గుంటి గంగా భవానీ అమ్మ వారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పూజారులు మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ బ్రహ్మణ అర్చకుడు కామేశ్వర శర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పుట్ట, నాగ శిలలు, మల్లికార్జునస్వామి వారికి పూజలు చేశారు. భక్తులకు అవసరమైన వసతుల ఏర్పాట్లను ఆలయ ఈఓ జి.వాసుబాబు, చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఏఆర్ కె.ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వేనూతల కాటమరాజుస్వామి

పెద్దారవీడు: మండలంలో గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగా భవానీ వేనూతల కాటమరాజుస్వామి, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన నాగాంజనేయ స్వామి పుట్టకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. దేవాలయం ప్రాంగణంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయాల ప్రాంగణంలో పొంగళ్లు తయారు చేసి స్వామి, అమ్మవార్లకు చెల్లించారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

నేడు కల్తీ మద్యానికి వ్యతిరేకంగా ర్యాలీ

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం కల్తీ మద్యానికి వ్యతిరేకిస్తూ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ ఏకుల ముసలారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా ఎక్సైజ్ శాఖా కార్యాలయం వద్దకు బయలుదేరి అక్కడ వినతి పత్రం అందచేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొంటారని, నియోజకవర్గంలో ఉన్న ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

కంప్యూటర్ ఆపరేటర్ల సమావేశం


ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రావుతో కంప్యూటర్ ఆపరేటర్లు

ఒంగోలు సబర్బన్: ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పిన్నిక మధుసూదనరావు ఆధ్వర్యంలో ఒంగోలులోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం జిల్లా రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు సమావేశమయ్యారు. కంప్యూటర్ ఆపరేటర్ల అసోసియేషన్ ఏర్పాటుపై సమీక్షించారు. ఈ నెల 5వ తేదీ అన్ని జిల్లాల నుంచి రెవెన్యూ కంప్యూటర్ ఆపరేటర్లు ఏపీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజును కలిశారని మధుసూదనరావు తెలిపారు. ఆయన ఆదేశాల ప్రకారం కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కొత్తగా కంప్యూటర్ ఆపరేటర్లతో జిల్లా అసోసియేషన్ బాడీ ఏర్పాటుపై చర్చించారు. సమావేశంలో ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా ట్రెజరర్ ఊతకోలు శ్రీనివాసరావు, జిల్లాలోని కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



తాళ్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

సహ చట్టంతో ప్రశ్నించే హక్కు

పుల్లలచెరువు: వినియోగదారులు ఆర్టీఐ యాక్టును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మరియదాసు అన్నారు. ఆదివారం ఆర్టీఐ యాక్టు ఏర్పాటు చేసి 20 సంవత్సరాలైన సందర్భంగా అధికారుల ఆదేశాలపై మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆర్టీఐ యాక్టు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. దీని ద్వారా ప్రశ్నించే హక్కు వస్తుందన్నారు. గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు యాక్టుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పుల్లారెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

తాళ్లూరు: సమాచార హక్కు చట్టం 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంపీడీవో పీ అజిత ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తాళ్లూరులో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సుబ్బయ్య మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సేవలు ప్రజలకు పారదర్శకంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో బి ప్రసాద్ రావు, ఏపీఎం దేవరాజ్ , సీనియర్ అసిస్టెంట్ ఎ.మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.


త్రిపురాంతకంలో ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు

త్రిపురాంతకం: సమాచార చట్టంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని కోరుతూ ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. త్రిపురాంతకంలో సమాచార హక్కు చట్టం ఏర్పాటై 20 ఏళ్లయిన సందర్భంగా ఉద్యోగులు ర్యాలీ చేశారు. తహసీల్దార్ సీహెచ్ కృష్ణమోహన్, ఎంపీడీఓ రాజ్‌కుమార్, ఏఓ సాంబశివరావు, డిటీ కిరణ్, ఏపీవో సుజాత, సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు, ఉద్యోగులు పాల్గొన్నారు.


పుల్లలచెరువులో ర్యాలీ చేస్తున్న అధికారులు

దీపావళి మందులకు అనుమతి తప్పనిసరి


మాట్లాడుతున్న ఎస్ఐ త్యాగరాజు

దొనకొండ: గ్రామాల్లో దీపావళి మందుల విక్రయానికి వ్యాపారులు తప్పకుండా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ టీ త్యాగరాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా టపాసులు అమ్మరాదని తెలిపారు. దీపావళి పండగ సందర్భంగా ముందుగా నిల్వ చేయడం, అమ్మడం చట్ట రీత్యా నేరమన్నారు. ప్రభుత్వం ద్వారా తగిన అనుమతులు పొందకుండా అమ్మరాదని, అనుమతులు పొందిన వారు నిబంధనలు పాటించాలన్నారు. అనుమతులు లేకుండా పేలుడు వస్తువులు అమ్మిన వారి పేర్లు పోలీసులకు ఇవ్వాలన్నారు. వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

రేపు రైతు సంఘం మండల మహాసభ


మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రైతు సంఘం జిల్లా నాయకులు, రైతులు

పెద్దారవీడు: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మూడో మండల మహాసభను మండల పరిధిలో హనుమాన్ జంక్షన్‌కుంటలో 14వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా నాయకులు దగ్గుపాటి సోమయ్య తెలిపారు. రైతు సంఘం కరపత్రాన్ని రైతులతో కలిసి రైతు సంఘం నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహసభకు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయంత్‌బాబు, పమిడి వెంకటరావులు పాల్గొంటారని పేర్కొన్నారు. మండల పరిధిలో గ్రామాల్లో నుంచి రైతులు విరివిగా మహసభలో పాల్గొని విజయవంతం చేయాలని పిలునిచ్చారు. కరపత్రం ఆవిష్కరించిన వారిలో రైతు సంఘం నాయకులు దుగ్గెంపుడి తిరుపతిరెడ్డి, గంగిరెడ్డి రాజశేఖరరెడ్డి, దొడ్డా సుబ్బారెడ్డి, దుగ్గెంపుడి కొండారెడ్డి, ఏరువ వెంకటసుబ్బారెడ్డి, దుగ్గెంపుడి మల్లారెడ్డి, సొంటి రాధాకృష్ణారెడ్డి, గోపిదేశి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా నగరోత్సవం


సాయిబాబా నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సంతనూతలపాడు: స్థానిక సాయిబాబా సత్సంగం ఆధ్వర్యంలో సాయిబాబాకు ఆదివారం భక్తిశ్రద్ధలతో నగరోత్సవం నిర్వహించారు. సాయిబాబా, శరత్ బాపూజీ చిత్రపటాలతో సాయిబాబా భక్తి పాటలు, స్వరాలతో ఘనంగా నగరోత్సవం జరిగింది. భక్తుల నినాదాలు, హారతులతో సాయిబాబాకు సంతనూతలపాడు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ప్రజలు శాంతి, సౌఖ్యం, సౌభాగ్యంతో కొనసాగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో సాయిబాబా గురు బంధువులు, మహిళలు, సాయిబాబా సత్సంగ బృంద సభ్యులు పాల్గొన్నారు.